కస్తూర్బా.. కష్టాలు!

- అరకొర సౌకర్యాలతో బాలికలు సతమతం
- ఆర్‌ఓ ప్లాంట్ లేక తాగునీటి కష్టాలు
- మైదానం ఉన్నా.. ఆటలకు దూరం
- పీఈటీ పోస్టు ఖాళీ


కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం

ఆమనగల్లు: సౌకర్యాల లేమితో కస్తూర్బాగాంధీ విద్యార్థినులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. విద్యాభ్యాసంలో ఇబ్బంది లేకపోయినా.. తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. కావలసిన ఆటస్థలం ఉన్నా.. అనుకూలంగా లేకపోవడంతో పాటు.. మూడు నెలలుగా పీఈటీ పోస్టు ఖాళీగా ఉండటంతో బాలికలు ఆటలకు దూరం అవుతున్నారు. అంతే కాకుండా పాఠశాల చుట్టూ ప్రహరి లేకపోవడంతో అభద్రతాభావంతో గడుపుతున్నట్లు చిన్నారులు పేర్కొంటున్నారు.

ప్రహరీ నిర్మించాలి

పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. తొలుత మరమ్మతుకు గురైన ఆర్‌ఓ ప్లాంటును వినియోగంలోకి తెచ్చి, తాగునీటి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు. ప్లాంటు పనిచేయకపోవడంతో.. నిత్యం నీటిని కొనుగోలు చేస్తున్నామని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఖాళీగా ఉన్న పీఈటీ, అకౌంటెంట్ పోస్టులను భర్తీ చేయాలని, పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించి, ఆటలకు అనుకూలంగా క్రీడామైదానం ఏర్పాటు చేయాలని చిన్నారులు విన్నవిస్తున్నారు. దాంతో పాటే.. డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలన్నారు. ఇదే విషయమై కేజీబీవీ ప్రత్యేకాధికారి పద్మజ్యోతిని వివరణ కోరగా.. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లామని వెల్లడించారు.

230 మంది విద్యార్థినులు

కసూర్బాలో ప్రస్తుతం 230 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. 2006లో ఆమనగల్లు పట్టణానికి ప్రభుత్వం కేజీబీవీని మంజూరు చేసింది. కొంత కాలం ప్రైవేటు భవనంలో పాఠశాల కొనసాగినప్పటికీ.. 2010 నుంచి సొంత భవనం వినియోగంలోకి వచ్చింది. 6 నుంచి 10 తరగతులు కొనసాగుతున్నాయి.

నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్

- సీఎం రేవంత్‌రెడ్డిది అబద్ధపు పాలన
- హామీల అమలులో ప్రభుత్వం విఫలం: బీజేపీ నేతలు
- ఆమనగల్లులో బైక్ ర్యాలీ

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అబద్ధాలు, మోసాలతో పాలన కొనసాగిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కండె హరి ప్రసాద్ ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ 'ఆరు అబద్ధాలు–అరవై ఆరు మోసాల' పేరిట బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం కల్వకుర్తిలో నిర్వహించిన బైక్ ర్యాలీకి వెళ్లేందుకు.. పట్టణంలో చేపట్టిన బైక్ ర్యాలీని మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, పార్టీ నాయకులతో కలిసి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం హరిప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గోకారం చెరువును రిజర్వాయర్‌గా మార్చాలని, కేఎల్ఐ డీ82 కాలువ ద్వారా నాగిళ్ల వరకు సాగునీరు అందించాలని, అన్ని మండలాల్లో బీటీరోడ్లను నిర్మించాలని, ఇర్విన్, వెల్జాల, గట్టుప్పలపల్లి గ్రామాలను మండల కేంద్రాలుగా ఏర్పాటు చేయాలని కోరారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు లక్ష్మణ్, నర్సింహ, కృష్ణనాయక్, చెన్నకేశవులు, పార్టీ నాయకులు గోరటి శ్రీను, శ్రీను, గిరియాదవ్, కృష్ణయాదవ్, నరేందర్ ఉన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: మండల కేంద్రం నుంచి బీజేపీ నాయకులు ఆదివారం పెద్ద సంఖ్యలో కల్వకుర్తి నియోజకవర్గం కేంద్రానికి తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో నిరసనగా 'ఆరు అబద్ధాలు–అరవై ఆరు మోసాల' పేరిట కల్వకుర్తిలో నిర్వహించిన బైక్ ర్యాలీకి మండలం నుంచి పార్టీ శ్రేణులు బైక్‌లపై తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో పార్టీ జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు సాయిలాల్ నాయక్, మండల అధ్యక్షుడు మాన్యనాయక్, నాయకులు లక్ష్మణ్‌నాయక్, మనీశ్‌నాయక్, శ్రీను, కుమార్ తదితరులు ఉన్నారు.


ఆమనగల్లు: బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

క్లుప్తంగా

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన శ్రీకాంత్


శ్రీకాంత్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్

ఆమనగల్లు: పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి యువతకు, ప్రజలకు వివరించాలని, తద్వారా అత్యధికులు పార్టీలో చేరేలా ప్రోత్సహించాలని ఎమ్మెల్సీ సూచించినట్లు శ్రీకాంత్ పేర్కొన్నారు.

12 నుంచి బ్రహ్మోత్సవాలు


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తలకొండపల్లి: మండల పరిధి రాంపూర్‌లో లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 12 నుంచి 17 వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ జిల్లెల పవన్ కుమార్ రెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అమృత, ఆలయ కమిటీ డైరెక్టర్లు సామి గౌడ్, జంగయ్య, ఆలయ పూజారి నరసింహ చారి, మాజీ సర్పంచ్ శ్యామ్ సుందర్ రెడ్డి, కృష్ణా రెడ్డి, శ్రావణ్ కుమార్ రెడ్డి, మాధవచారి, మల్లేశ్, వెంకటేశ్, శివ, షర్పుద్దీన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎమ్మార్పీఎస్ పోచారం గ్రామం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కల్యాణ్, ఉపాధ్యక్షుడిగా యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా భరత్, ప్రచార కార్యదర్శిగా కిరణ్, కార్యదర్శిగా శ్రీకాంత్, ప్రధాన సలహాదారు జగన్‌ను నియమించినట్లు సంస్థ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 10న ఇబ్రహీంపట్నంలో జరిగే మాదగి సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాబు, మహేందర్, నర్సింహ, శ్రీను, లింగం, నరేందర్, కిరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ ఉపాధ్యక్షుడికి సన్మానం


దశరథ్‌నాయక్‌ను సన్మానించిన నాయకులు

కడ్తాల్: లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్ నాయక్‌ను బీఆర్ఎస్ నాయకులు ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విజితారెడ్డి, పార్టీ అన్మాస్‌పల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు మహేశ్, నాయకులు శ్రీను, ప్రశాంత్, భాస్కర్, మల్లేశ్, ప్రేమ్, రమేశ్, రవి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

యువకవికి జాతీయ స్థాయి పురస్కారం

తలకొండపల్లి: జాతీయ స్థాయి పురస్కారానికి మండల పరిధి కొరికిరాలతండాకు చెందిన మూడావత్ లోకేందర్ చవన్ ఎంపికయ్యారు. లోకేందర్ రాసిన 'తెలుగు జాతి' కవిత్వం ఆదరణ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 2024 పదో వార్షికోత్సవంలో జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికైంది. ఈ మేరకు ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా మార్కాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో లోకేందర్‌ను సొసైటీ నిర్వాహకులు, కవులు, రచయితలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. పురస్కారం, జ్ఞాపికను అందజేసి అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కవి, రచయిత డాక్టర్ రత్నం, కళారత్నం, కవయిత్రి రంగిశెట్టి రమేష్ ఉన్నారు.

బస్ సర్వీసును పునరుద్ధరించాలి

సీపీఎం నాయకుల డిమాండ్


సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

మంచాల: కరోనా కారణంగా నిలిపివేసిన ఆర్టీసీ బస్సులను యథావిధిగా తిప్పాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. తిప్పాయిగూడ–ముకునూర్ రోడ్డును మరమ్మతు చేయాలని కోరారు. ఆదివారం నాయకులు తిప్పాయిగూడలో ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు గోరంకల నర్సింహ మాట్లాడుతూ.. రెండేళ్లుగా ఇబ్రహీంపట్నం నుంచి చౌటుప్పల్ (వయా ఆరుట్ల, తిప్పాయిగూడ) ఆర్టీసీ బస్సు రావడం లేదని తెలిపారు. దీంతో రవాణా సౌకర్యం లేక తిప్పాయిగూడ, చిత్తాపూర్, ఆరుట్ల, తాళ్లపల్లిగూడ, ముకునూర్ నుంచి చౌటుప్పల్‌కు వెళ్లేందుకు ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. ఇంతకు ముందు లాగే మధ్యాహ్నం 2 గంటలకు ఇబ్రహీంపట్నం వయా ఆరుట్ల, తిప్పాయగూడ మీదుగా చౌటుప్పల్, తిరిగి ఉదయం 10 గంటలకు ఆయా గ్రామాల మీదుగా చౌటుప్పల్ నుంచి ఇబ్రహీంపట్నం వచ్చే విధంగా బస్సును తిప్పాలని కోరారు. ఇదే విషయంపై పట్నం ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేశామని, అయినా స్పందన లేదని ఆరోపించారు. అందుకే సంతకాల సేకరణ చేసి, ఉన్నతాధికారులను సంప్రదిస్తామని వెల్లడించారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు యాదయ్య, నాయకులు సుధాకర్, ఐలయ్య, కృష్ణ, మాధవి, కృష్ణవేణి, ప్రశాంత్, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా పడిపూజ

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ గ్రామంలో అయ్యప్ప స్వామి మహాపడిపూజ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. దనంజయ గురుస్వామి, జనార్దన్‌గౌడ్, రవి, శరణ్ పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి


నియామక పత్రాలు అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

తుర్కయంజాల్: మున్సిపాలిటీలో బీఎస్పీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు పట్నం రమేష్ కుర్మ అన్నారు. ఆదివారం పుర పరిధి ఇంజాపూర్‌లో పార్టీ ఉపాధ్యక్షుడు ఎల్.రాజు అధ్యక్షతన మున్సిపల్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మల్లెల రఘు, కోశాధికారిగా రంజిత్ కుమార్, కార్యదర్శిగా సత్యనారాయణను నియమించారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, శ్యామ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘం కమిటీ ఎన్నిక

మీర్‌పేట: కురుమ సంఘం మీర్‌పేట(జిల్లెలగూడ) కార్పొరేషన్ నూతన కమిటీని ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్దాల దశరథ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా దెవిరింటి వెంకటేశ్, ఉపాధ్యక్షులుగా అచ్చిని యాదగిరి, సిద్దాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ప్యాట నర్సింహ, కార్యదర్శిగా అచ్చిని కార్తిక్, కోశాధికారిగా సిద్దాల కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా సిద్దాల జగదీశ్, జోగు శ్రీశైలం ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర ఎన్నికల అధికారి కిష్టగోని సదానందం సమక్షంలో కమిటీని నియమించామని, త్వరలోనే సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరిస్తామని దశరథ్ తెలిపారు.

11న బహిరంగ వేలం

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో 2025 ఆర్థిక సంవత్సరానికి గాను కొబ్బరికాయలు, పూజా సామగ్రి, లడ్డూ, పులిహోర విక్రయించే హక్కు, ఒడిబియ్యం, అమ్మవారి చీరలు, కొబ్బరి చిప్పలు సేకరించే హక్కు కోసం ఈ నెల 11న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఏఈ వి.మోహన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి ఆలయం వద్ద ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు రూ.20 వేలు, రూ.10 వేల నగదును అదేరోజు ఒక గంట ముందు వచ్చి డిపాజిట్‌గా చెల్లించి, వేలంలో పాల్గొనాలని సూచించారు.

ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

ఎమ్మార్పీఎస్ జేఏసీ నాయకులు

మంచాల: మాదిగల ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జేఏసీ మండల అధ్యక్షుడు కంబాలపల్లి భాస్కర్ కోరారు. ఆదివారం మండల కార్యాలయం ఆవరణంలో సమ్మేళనం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం చట్టబద్ధంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వర్గీకరణ జరిగితే ఎస్సీలోని అన్ని కులాల వారికి మేలు జరుగుతుందని తెలిపారు. మొదటి నుంచి సమితి సామాజిక న్యాయం, వర్గీకరణ కోసం అనేక రూపాల్లో ఉద్యమిస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 10న ఇబ్రహీంపట్నంలో నిర్వహించే సమ్మేళానికి మాదిగలందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమితి సంఘం నాయకులు ప్రతాప్, బాబు, పాండు, కృష్ణ, యాదయ్య, సుధాకర్, జంగయ్య, పాండు, రవి, శివ కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: ఈ నెల 10న ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ కూడలిలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి మాదిగ, మాదిగ ఉపకులాల వారు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నేతలు పిలుపునిచ్చారు. అనంతరం మండల కేంద్రంలో సమ్మేళనం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

- రూ.10.50 కోట్లతో రాందాస్‌పల్లి రోడ్డు నిర్మాణం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


ఇబ్రహీంపట్నం రూరల్: ఎమ్మెల్యే మల్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. రాందాస్‌పల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. చింతపల్లిగూడ ఎక్స్ రోడ్డు నుంచి రాందాస్‌పల్లి, బ్రాహ్మణపల్లి రోడ్డు, కోహెడ క్రాస్‌రోడ్డు నుంచి రాందాస్‌పల్లి వరకు రోడ్డు అధ్వానంగా ఉందని, ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు ఏవీ తిరగలేని దుస్థితి నెలకొందని ఎమ్మెల్యే దృష్టికి తేగా.. దీనికి స్పందించిన ఆయన మాట్లాడారు. ఈ రహదారి ఆరు కిలో మీటర్ల 60 మీటర్ల వరకు పూర్తి స్థాయి నిర్మాణం కోసం రూ.10.50 కోట్లు మంజూరు అయిందని తెలిపారు. త్వరలోనే పనులు పూర్తి చేయిస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజు, భిక్షపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదం అందజేత

తుర్కయంజాల్: మంత్రివర్గ విస్తరణలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి చోటు కల్పించాలని సామాజిక కార్యకర్తలు కూరపాటి నరసింహ రాజు, సరికొండ రుషికేశ్వర్ రాజులు కోరారు. మల్‌రెడ్డికి మంత్రి వర్గంలో చోటు కల్పించాలని కోరుతూ ఇటీవల వారిద్దరు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి యాదగిరి గుట్ట వరకు 84 కిలో మీటర్ల పాదయాత్ర ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ యాత్ర శనివారం గుట్టకు చేరుకుంది. ఈ సందర్భంగా ఇరువురు లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి ప్రసాదాన్ని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలకు ఆదివారం అందజేశారు. అదే విధంగా సీఎం సహాయ నిధి కోసం సేకరించిన లక్ష నూట పదహారు రూపాయలను త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డికి అందజేస్తామని తెలిపారు.

పొలానికి దారి చూపండి

యాచారం: తమ పొలాలకు వెళ్లేందుకు దారి చూపించాలని మండల పరిధి మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన రైతులు తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డిని కలిశారు. బడేడ్ లేబర్ కార్మికులు ప్రభుత్వం ఇచ్చిన భూమిలో సాగు చేసుకుంటున్నారు. అయితే వారి పొలాలకు వెళ్లే దారి విషయంలో కొన్ని రోజులుగా పట్టా రైతులతో వివాదం జరుగుతోంది. పోలీస్ స్టేషన్‌లోనూ ఇరువురు ఫిర్యాదు చేసుకున్నారు. ఇదే విషయమై ఎమ్మెల్యేను పలువురు బడేడ్ లేబర్ (రైతులు) కలిసి.. పట్టా రైతుల భూముల నుంచి తమ పొలాలకు వెళ్లేందుకు దారి ఇప్పించాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే యాచారం సీఐ నర్సింహరావుకు ఫోన్ చేసి దారి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేయాలని సూచించినట్లు రైతులు పేర్కొన్నారు. గ్రామస్తులు ముత్యాల్ రెడ్డి, రవి, యాదయ్య ఉన్నారు.

అర్హులు లబ్ధి పొందేందుకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

యాచారం: ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అర్హులైన పేదలు లబ్ధిపొందేందుకు కృషి చేద్దామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ఆయన మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు పర్యటించే సమయంలో కమిటీ సభ్యులు వారి వెంటే ఉండి.. పార్టీలకు అతీతంగా నిజమైన అర్హులు లబ్ధిపొందేలా చూడాలని సూచించారు. తద్వారా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు గెలుపొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో గడ్డమల్లయ్యగూడ మాజీ సర్పంచ్ సురేందర్‌రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనువాస్ ముదిరాజ్, నాయకులు మల్లేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాసుల అందజేత


ఉచిత బస్‌పాసులు అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బుగ్గరాములు డిమాండ్ చేశారు. గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి సహకారంతో ఆర్టీసీ–2 డిపో అధికారులు తులేకలాన్ గ్రామానికి చెందిన 60 మంది దివ్యాంగులకు జారీ చేసిన ఉచిత బస్‌పాసులను గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బీరప్ప, ఆర్టీసీ అధికారులు శివరాజ్‌గౌడ్, అంజయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు యాదగిరి, జంగారెడ్డి, ఆంజనేయులు, వెంకటేశ్ పాల్గొన్నారు.

బాలుడికి పరామర్శ


విద్యార్థిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్‌రూరల్: పాఠశాల బస్సు అదుపుతప్పిన ఘటనలో గాయపడిన విద్యార్థి నందీశ్వర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదివారం ఆస్పత్రిలో బాలుడిని పరామర్శించారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాఠశాల యాజమాన్యంతో మాట్లాడతానని, మీకు ఏమైనా ఇబ్బంది కలిగితే సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులకు సూచించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్ బాబర్, డైరెక్టర్ కరుణాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు ఇబ్రహీం ఉన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

మహేశ్వరం: ముస్లిం నేత అయ్యప్ప మాలధారణ భక్తులకు అన్నదానం చేసి మతసామరస్యాన్ని చాటుకున్నాడు. మతాలు వేరైనా మనుషులందరూ ఒక్కటేనని అయ్యప్ప పూజలో పాల్గొన్నారు. మండల పరిధిలోని చిన్న తూప్ర గ్రామానికి చెందిన కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు మహ్మద్ అదిల్ ఆదివారం గ్రామంలో అయ్యప్ప మాల ధరించిన భక్తులకు అన్నదానం(భిక్ష) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదిల్ మాట్లాడుతూ.. గ్రామంలో మాల ధారులకు 14 సంవత్సరాలుగా భిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నానని తెలిపారు. మా గ్రామంలో హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా అందరం కలిసిమెలసి అన్నదమ్ముల్లా స్నేహపూర్వకంగా ఉంటామని తెలిపారు. గణేశ్ ఉత్సవాలు, రంజాన్, దసరా, బోనాల పండుగలను అందరం కలిసి జరుపుకొంటామని పేర్కొన్నారు. అనంతరం అయ్యప్ప భక్తులు అదిల్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

ప్రజాపాలన జీర్ణించుకోలేని విపక్షాలు

- ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్న నాయకులు
- రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేందుకు కుట్ర
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: ఏడాది కాంగ్రెస్ ప్రజాపాలనలో సాధించిన ప్రగతిని జీర్ణించుకోలేని విపక్షాలు.. రాజకీయ లబ్ధిపొందేందుకు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విమర్శించారు. నిందలు వేస్తూ.. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాధించలేని ప్రగతిని, రేవంత్‌రెడ్డి సర్కార్ అనతి కాలంలోనే చేరువ చేసిందని పేర్కొన్నారు. పట్టణంలోని ఓ గార్డెన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచి, అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రభాగన నిలిపేందుకు సీఎం రేవంత్.. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో అస్తవ్యస్తం

అభివృద్ధిని ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు.. ప్రగతిని అడ్డుకునేందుకు దినచర్యలో భాగంగా పెట్టుకున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులతో అధోగతి పాలు చేస్తే.. అధికారం చేపట్టిన కాంగ్రెస్.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టిందని వెల్లడించారు. అభివద్ధిపై చర్చించేందుకు దమ్ముంటే విపక్ష నాయకులు అమరవీరుల స్థూపం వద్దకు రావాలని సవాల్ విసిరారు.

నిందలతో కాలం గడుపుతున్న బీజేపీ

బీజేపీ నాయకులు కేంద్రంలోని తమ ప్రభుత్వం ద్వారా తెలంగాణ అభివృద్ధికి నిధులు తీసుకురాక పోగా, రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేస్తూ కాలం గడుపుకొంటున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి ఎద్దేవా చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కులగణన చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రభుత్వ తోడ్పాటుతో బహుళజాతి కంపెనీలు పెట్టుబడులకు ముందుకు వస్తున్నాయని పేర్కొన్నారు. ఏడాది ప్రజాపాలనలో కల్వకుర్తి నియోజకవర్గానికి వివిధ పథకాల కింద రూ500 కోట్లు మంజూరయ్యాయని స్పష్టంచేశారు. సమావేశంలో పీసీసీ అధికార ప్రతినిధి యోగీశ్వర్ రెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ ప్రెసిడెంట్ నర్సింహ్మ, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి ఉన్నారు.